# నీ లాంటోడు-
# నా లాంటోడు

-చిన్న

"బండి ఆపరాదు జెరా దిగుతము..." స్టేజి వచ్చిందో లేదో టాంగలో కూర్చున్నోళ్లు తొందరపెట్ట సాగారు.

"అయ్యో ఆగుండ్రి ఆపుతున్న... గంత తొందర ఎందుకు? వో... వో..." మల్లయ్య గుర్రపు బండిని ఆపే ప్రయత్నంలో పడ్డాడు.

టాంగ ఆగగానె ఒకరెనుక ఒకరు నలుగురైదుగురు బండి దిగినారు. దిగినోళ్లు దిగినట్టుగా చిల్లర ఉన్నోళ్లు 'మూడు రూపాయల చార్జి' మల్లయ్య చేతిలో పెట్టి హడావుడిగా వెళ్లిపోసాగారు. పది రూపాయల నోటు, ఐదు రూపాయల బిళ్లలు ఇచ్చినోల్లకు చిల్లర లెక్కబెట్టి ఇవ్వసాగాడు మల్లయ్య. కొద్దిసేపటిలోనె ఎక్కడివాళ్లు అటు వెళ్లిపోయారు. నెత్తిమీద బరువు దిగినట్టయింది మల్లయ్యకు.

బండిని తిరిగి తనూరువైపుకు తిప్పుకొని రోడ్డు పక్కని ఉన్న చెట్టు కింద నిలబెట్టాడు. ఆ చెట్టు కింది నీడ చాలా ఏండ్ల నుండి 'టాంగల స్టాండ్'గా స్థిరపడిపోయింది. గుర్రంనోట్ల ఉన్న కళ్లాన్ని తీసి, బండి కింద ఉన్న సంచిలో పచ్చిగడ్డి తీసి గుర్రం ముందు పోశాడు. గడ్డి పరకల్ని కొరకసాగింది గుర్రం.

ఒకసారి మెయిన్‌రోడ్ మీదికి చూశాడు మల్లయ్య. ఈరోజు శుక్రవారం. మండల కేంద్రంలో అంగడి నడుస్తుంది. జనం రద్దీ గూడ క్రమంగా పెరగసాగింది వస్తువులతో.

ఈరోజు అంగడి కాబట్టి బాగానె కిరాయి తగులుతదని అనుకున్నడు. కాని అనుకున్నట్లుగా లేదు- మళ్ళోసారి ఊరికి పోయి వద్దామనిపిస్తుంది. అంగడికి వచ్చేటోళ్లు ఏమైన దొరుకుతరని ఆశ.

తనూరు వైపుకు పోటానికి రెండు ఆటోలు, ఒక జీబు రడీగా వరుసలో నిలబెట్టి ఉన్నాయి. వరుసలో ముందున్న ఆటోవాడు "వెల్పర్తి... కీర్తిపల్లి... మొగిలిపాక... ముత్తిరెడ్డిగూడెం..." అంటూ భయంకరంగా అరుస్తున్నాడు.

ఆ అరుపులకు, హడావుడికి మల్లయ్య గుండెను ఎవరో పిండినట్లయింది. కడుపుల నుండి దేవినంత పనయితది. కాని చాలా రోజుల నుండి వీటికి అలవాటు పడిపోయాడు. మనసు, శరీరం మొద్దుపారిపోయినట్లయింది. మొండికో తొండికో అట్లని బండి నడుపుకొస్తున్నాడు.

వచ్చేటప్పుడు ఊర్ల రాజయ్య సేటు ఇచ్చిన రెండు నూనె డబ్బాలను బండి కింద నుంచి తీసి, పక్కన ఉన్న కిరాణం షాపులో ఇచ్చి నింపి పెట్టమని చెప్పాడు. అలాగే వెంకటరెడ్డి పటేల్ నాలుగు యూరియా బస్తాలను ఏసుకు రమ్మని చెప్పిన విషయం గుర్తొచ్చింది.

"ఎవరైనా ఒకరిద్దరొచ్చిన బాగుండు..." అనుకుంట ఆశగా చూసిందుగాని ఎవరు వచ్చేటట్టు లేరు. ఒకరిద్దరున్న ఆటో దగ్గర ఉన్నారు. వాళ్లు వచ్చేటట్లు లేదు.

ఒకప్పుడు ఎట్ల ఉండేది...! టాంగ ఇట్ల ఆగిందో లేదో పదిమంది రడీగా ఉండెటోళ్లు. అట్లాంటి బేరాలు, పడతాలు ఇప్పుడు ఎక్కడివి? బలవంతంగా బతిమిలాడితే, పరిచయమున్నోళ్లు ఒకరిద్దరు ఎక్కుతున్నారు. ఆ రోజులు గుర్తుకు వస్తూనే గుండె మెలేసినట్టయితది...

ఇరవై ముప్పయి ఏండ్ల క్రితం కావచ్చు, ఊర్లకు టాంగ వచ్చి. అప్పటికి తన వూరి మీద నుండి ఉదయం పూట, సాయంత్రం పూట ఓసారి ప్రైవేటు సర్వీసు నడుస్తుండే. అది తప్పిందంటే అయిదారు కిలోమీటర్లు నడిచి ఇప్పుడున్న మండల కేంద్రానికి చేరాల్సిందే. ఆడ బస్సెక్కి ఏ నల్లగొండో, రామన్నపేటో, భువనగిరికో పనులు చేసుకోటానికి పోవాల్సిందే. అటువంటి సమయంలో మల్లయ్య ఈ బండి కొన్నడు.

ఈ ఆలోచన ముందు లేకుండే. మల్లయ్య బామ్మర్ది రాగిరికి, యాదగిరిగుట్టకు మధ్య టాంగ కొట్టెటోడు. అది చూసి తను గూడ టాంగ నడపాలని నిర్ణయించుకుండు.

మొదటిసారిగ మల్లయ్య ఊర్లకు బండిని తెచ్చినపుడు ఎంత సందడి. ఊరు ఊరంత వచ్చి చూసిపోయారు. మల్లయ్యకు ఒకలాటి ఉద్రేకం, ధైర్యం పుట్టు

కొచ్చాయి.

మల్లయ్య బండి వచ్చాక దాన్ని చూసి ఒకదాని వెనుక ఒకటి, ఒకన్ని చూసి ఇంకొకరు పది, ఇరవై టాంగలు అయినయి ఊర్ల. ఎవరి గిరాకి వాళ్లకు ఉం డేది. మల్లయ్యకు మాత్రము ఎక్కువ గిరాకి, డిమాండ్ ఉండేది. ఆయన దగ్గర ఎర్రది, తెల్లది రెండు గుర్రా లుండేవి. కింద పడెయ్యవని అందరి నమ్మకము. అం దుకే అందరు ఆయన బండి ఎక్కాలని ఉండేది. ఊర్ల దొరలు, ఉన్నోళ్లుగాని ఆయన బండి ప్రత్యేకంగా కట్టించుకొని పోయేటోళ్లు...

అట్లాంటిది ఇప్పుడు ఒకదాని ఎమ్మటి ఒకటి అన్నీ మాయమై ఒకటి రెండు టాంగాలు మిగిలిపోయినయి. అందులో మల్లయ్యది ఒకటి. దీన్ని అమ్మేసి ఏదైన పని చేసుకుంటే బాగుండునని అప్పుడప్పుడు అనిపి స్తది. కాని ఈ బండి తన కడుపునైతే నింపుతుంది కదా, చావనైతే చావట్లేదుగా అనిపిస్తుంది ఇంకోసారి. ఇది బతికించినంత కాలం నడుపుతా, లేనినాడు బందుచేస్తా. ఇవే ఆలోచనలతో గతానికి గుర్తుగా ఈ బండిని నడుపుకొస్తున్నడు.

"బండి పోతదా మల్లయ్య ఇప్పుడు?" మాటలకు ఉలిక్కిపడ్డాడు ఆలోచనల నుండి తేరుకుంటూ, వెనుక వైపునున్న సాలోల్ల నర్సింహ్మాను చూశాడు.

"పొద్దున్నె ఎటు పోయి వస్తున్నవు మామ?" పక్కని ఉన్న నర్సింహ్మా భార్యను చూశాడో.

"ఎటు పోయేది ఉంది... ఆ ముసల్దానికి బాగా లేదంటె డాక్టర్‌కు చూపించుకొని వస్తున్నా..." ఒక చేతుల ఉన్న మందుల సంచిని గట్టిగా పట్టుకుంటు, రెండో చేతితో మనవన్ని పట్టుకొని.

"సరే ఎక్కండి మామ పోదాం..." గుర్రం మూతికి కళ్లాన్ని తగిలించాడు. దాని మూతి ముందున్న పచ్చి గడ్డిని ఏరి బండి కింది సంచిలో వేశాడు.

రాజయ్య సేటు నూనె డబ్బాలను, వెంకట్‌రెడ్డి యూరియ బస్తాలను, ఒకటి ఉల్లిగడ్డల బస్తాను, కోకో, థమ్సప్ కేసులను బండిలో ఓ మూలకు సర్దాడు మల్లయ్య.

ఇంకా ఒకరిద్దరు వస్తరేమోనని ఆశగా చూశాయి గాని ఎవరు వచ్చేటట్టు లేదు. పైగా దూరంగా ఆటోవాడు భయంకరంగా అరుస్తున్నాడు. ఇంకా ఇట్లనే ఉంటె ఈ ముసలోళ్లు దిగిపోవచ్చు. ఇవే ఆలోచనలతో

"ఛల్..."మంటూ చంద్రకోలతో గుర్రాన్ని అదిలిం చాడు.

బండి కొద్దిగా వేగం అందుకుందో లేదో, కొద్ది దూరం పోగానే వెనుక నుండి పెద్ద కూత వినిపిం చింది.

"బండాపు నేనొస్తున్న...", పండెండేళ్లమ్మాయి దు మ్ములో పడి ఉరికి రాసాగింది. బాగా ఒగిరిస్తుంది. ఆ అమ్మాయిని గుర్తుపట్టి అన్నాడు.

"ఏడ నుండి పోరి అట్ల ఉరికొస్తున్నవు?" బండి నెమ్మది చేస్తు అన్నాడు మల్లయ్య.

"దవఖానకు పోయి వస్తున్న తాత" ఒక్క గెంతులో బండెక్కి ముసలోల్ల పక్కన కూర్చుంట అంది.

"ఎట్లుంది పోరి మీ నాయనకు?" గుర్రాన్ని అదిలిస్తూ.

"నిన్న కడుపుల మందు కక్కించినీరు, లేచి మాట్లా డుతుండు...."

"ఆడుండక వస్తున్నవేంది పోరి?"

"ఆడ మా అమ్మ ఉంది. ఆడుంటె ఎట్ల తాత? అన్నం తీసుకపోయేది ఎవరు? ఇంటి దగ్గర తమ్ముళ్లు లేరు...", బరువు బాధ్యతలన్ని తన మీద ఏసుకున్నట్లు మాట్లాడసాగింది ఆ అమ్మాయి.

"ఎవరి బిడ్డ ఈ పిల్ల?" పక్కన ఉన్న ముసలామె అడిగింది.

"గా బంటోళ్ల నర్సిగాని కూతురు గదూ ఇది. మొన్న సచ్చిపోయేటందుకు వాడు పత్తిమందు పోసు కుండు. ఇగో ఈ గోస తీస్తుండు. ఆడు మంచిగనే పోతడు. గీ పిల్లల సంగతి ఏంది? పెండ్లికెదిగిన పోరి

## చేరుకోలేననుకోకు

ప్రియా!
నేను ఆకాశంలో
చుక్కనైనంత
మాత్రాన
నిన్ను
చేరుకోలేననుకోకు
ఏం?
చుక్కలు మాత్రం
తెగిరాలడంలేదూ...

-ఎం.నాగేశ్వరరావు

ఉండే, దీనెనుక ఇద్దరు పోరీలు ఉండే. గట్లని గదా పుట్టకోదు, చెట్టుకోదు అయ్యేది...” గుర్రాన్ని చెంద్ర కోలతో కొడుతూ, కాళ్లతో కింద తంతున్నాడు. బండి వేగం పెరిగింది.

“సావుడంటె లోకం మీద లెక్కలేకుంటయింది...” ముసలాయన ఎటో దూరంగ చూస్తూ గొణగసాగాడు.

అసలే మెటల్ రోడ్. ఎ కంట్రాక్టర్ పుణ్యమోగాని రోడ్డేసిన రెండు నెలలకే మట్టిపోయి, రాళ్లు లేచి గుంతలు గుంతలుగా తయారయింది. బండిలో కూర్చున్నాళ్లు కిందా మీదకు అవుతున్నారు.

“జెర నెమ్మదిగా పోనియ్ మల్లయ్య, పాణం బాగలేదు” ముసలామి అంది.

“అట్లనె అత్తా, ఈ రోడ్డు పాడుగాను...” రోడ్డు ఏసినోన్ని తిట్టుకుంటు బండిని నెమ్మది చేయసాగాడు.

“వో మల్లయ్య మామ జెర ఆగు వస్తున్నా...” రోడ్డు పక్కని కొద్ది దూరం నుండి కూత వినిపించింది.

“ఎవరూ... వడ్లోల్లి వెంకటాచారిలాగ ఉన్నట్టుందే...” పరిశీలిస్తూ టాంగ ఆపే ప్రయత్నంలో పడ్డాడు మల్లయ్య.

“ఈడున్నవేంది అల్లుడు...” బండి దగ్గరికి వచ్చిన చారిని అడిగాడు.

“కురుమోళ్ల బాయి దగ్గర చెట్లున్నయ్యంటె చూద్దామని వచ్చిన...”, బండెక్కుతు అన్నాడు చారి.

“బేరమయినయా...?”

“మర్రిచెట్టుకే గంత ధర చెప్పితే ఏడ గిడ్తతి మాకు?” బండిలో ముందువైపు సర్దుకుంటు అన్నాడు చారి.

“ఈ బేరం ఎప్పటినుండి మొదలుపెట్టినవు అల్లుడు!” నవ్వుతూ అన్నడు.

“నీకు తెలువనట్టు అడుగుతవేంది...” సర్రున లేచాడు చారి.

“కాదల్లుడు కోపం తెచ్చుకోకు... ఏ పని చేసిన గట్టిగ పట్టుకోవు. కంపెనిలో పనిచేస్తవని కొన్ని రోజులు పట్నం పంటి తిరిగివస్తివి. ఆడ అయిపోయినంక ఏవో సొంతంగ నాగలి కర్రులు తయారు చేస్తనని బ్యాంక్‌ల లోన్ తెచ్చి అరవై, డెబ్బై వేలు మునిగితివి. ఇప్పుడేమో ఈ చెట్ల బేరమంటూ తిరగబడ్తివి...”

“అను మామ అను... ఎంతంటేంది, ఏమనుకుంటేంది నా కిస్మత్ బాగలేదు...”

“అట్లగాదు అల్లుడు... మీ నాయనకు నీ గురించి

## కాలజ్ఞానం

అతడు నిద్రిస్తుంటాడు
కాలం విలువ తెలియదు
అష్టసుఖాలు అమరిన నిద్ర
ఏక ఛత్రాధిపత్యమై ఏలుతూంది
నిద్రకు సామంతరాజై అతడు
కప్పంగట్టి దాసోహమంటాడు
ఉషోదయం నుండి ఉషోదయం దాకా
అస్తమయం నుండి అస్తమయం దాకా
నిద్రాముద్రితుడతడు
సోమరితనం అలసత్వం
అతడి ధమనులు సిరలు
అతణ్ణి మేల్కొల్పండి
ఒక్క నిముషం జరిగిన నిర్లక్ష్యం
క్షమార్హం కాని అలక్ష్యమై
ఎక్కాల్సిన రైలు కదిలిపోతే
బతుకు జీవితకాలం లేటు!
అతడు మాట్లాడుతుంటాడు
సమయం వుండదు
సందర్భం వుండదు
మాటలు ధార తెగని జలపాతం
నిముషాలు గంటలు మసౌతాయి
మాటలు రాసులౌతాయి
జల్లించిన జల్లెట్లో
ఒక్క మేలిమి మాట మిగలదు
అతడికి బోధించండి
ఒక్క సెకను వ్యవధిలో పతకం కోల్పోయిన
ఆటగాని వేదన రోదన!
అతడు విహరిస్తుంటాడు
వినోదాల్లో మునుగుతుంటాడు
కాలాన్ని నియంత్రించటం తెలియదు
స్వారీ చెయ్యటం తెలియదు
సంబరాల జడివానలో
తడిసి నానడమే వృత్తి
అతణ్ణి జాగృతం చెయ్యండి
అరగంట ఆలస్యమైతే
పరీక్షా కేంద్రానికి ప్రవేశం నిషిద్ధం
సంవత్సరం చదువు అజ్ఞాతవాసం
కాలాన్ని చదవటం జ్ఞానం
కాలాన్ని నడపటం ప్రజ్ఞ!

–అడిగోపుల వెంకటరత్నమ్

దిగులు. ఆయనతో పాటు 'బర్సె' పట్టుకుంటే అయి పోయేది గదా…" మల్లయ్య చనువుకొద్ది నవ్వుతూ అన్నాడు.

"నవ్వు మామ నవ్వు… నీ ముడ్డికిందికి నీళ్లొ స్తున్నయి తీయ్… ఈ బండమ్ముకొని తాళ్లు ఎక్కా ల్సిందే…!"

"ఎట్ల అల్లుడు!" గుర్రాన్ని అదిలిస్తూ

"ఇప్పటికే ఊర్ల మూడు ఆటోలు, నాలుగు జీబులు ఉండే. ఇంకా రెండు స్టీరింగ్ ఆటోలు వస్తున్నయి. ఇంగ నీ టాంగను ఇంట్ల పెట్టాల్సిందే…"

"ఒకరిద్దరన్న ఎక్కరా అల్లుడూ?"

"ఆ ఎక్కుతరు, ఎక్కుతరు… ఎవడో నాలాంటోడో తలమాసినోడు ఎక్కాల్సిందే, ఎవరు ఎక్కుతరు చెప్పు? ఏ జీబులో, ఆటోలో ఎక్కితే పది నిముషాల్లో, టేప్‌రికార్డర్‌లో పాటయిపోయే లోపున తీసుకపోయి ఊర్ల దింపుతుండే. హుషార్‌కు హుషార్! టైంకు టైం మిగిలె! అంతా హైటెక్ యుగం… స్పీడ్… స్పీడ్…! నీ దాంట్ల ఎక్కితే ఏముంది, ఒల్లునొప్పులు తప్ప…!"

"హైటెక్కో, ఏ టెక్కోగాని పొద్దున ఆటోల వస్తె నడుము లిరగొట్టిండు ఆటోవాడు వాడి స్పీడ్‌తో" పక్కన ఉన్న ముసలాయన వెంటనే అందుకున్నాడు.

"అయినా నాకు తెలువక అడుగుత, నీవు గంత స్పీడ్‌గ పోయి ఊర్ల చేయాల్సిన పనులు ఏమున్నయి చెప్పు? ఒట్టిగ తిరగాల్సిందే గదా? కోపం తెచ్చుకోకు అల్లుడు గిట్లంటున్ననని!" నెమ్మదిగ విడిచాడు.

"నాకెందుకు మామ కోపం!.. నీ వనుడు నేను వినుడు మామూలేగా!"

"చూడల్లుడు, రెండు మూడు మైళ్ల నుండి వస్తున్నాము. రోడ్డు సక్కగా ఉందా చెప్పు? ఎంత స్పీడ్ పోవాలనుకున్నా రోడ్డంత గుంతలు గుంతలు… గతుకులు గతుకులు… కిందా మీదా పడుకుంటు వస్తనె ఉన్నంగాని మద్యలో ఆగిందా? ఆటోలు, జీబులకంటె ఓ అయిదు, పది నిముషాలు వెనుక ముందు అయితది గంతె కదా…"

"బండి ఆపుతవా తాత దిగుత…", ఆ అమ్మాయి మల్లయ్య మాటల మద్యలో అడిగింది.

"సెంటర్ దగ్గర ఆపుతపా, అందరు ఆడ దిగుతరు…", బండిని ముందుకు ఉరికించాడు.

"ఆ… ఆ… ఆయ్…", అంటూ కళ్లెం పట్టుకొని బండిని ఆపాడు మల్లయ్య.

టాంగ ఆగిందో లేదో ఆ అమ్మాయి గబుక్కున బండి దిగింది. చేతుల ఉన్న ఐదు రూపాయల బిల్ల, మల్లయ్యకు ఇవ్వబోయింది.

"ఒద్దులె పోరి… మీ పరిస్థితి ఇట్లుండే, మీ నాయన ఇట్టికొచ్చినంక తీసుకుంట పో…", ఆ అమ్మాయిని పంపాడు.

ముసలామి కష్టంగా బండి దిగుతుంటె, ఆమెకు సాయంగ పట్టుకున్నడు మల్లయ్య.

"నీ కడుపు సల్లగుండ…", బండి దిగుతు అంది ముసలామి. బండి దిగినాక ఇద్దరి డబ్బులు మల్లయ్య చేతిలో పెట్టి, మనువన్ని చేతిల పట్టుకొని ముసలోల్లు ఇద్దరు వెళ్లిపోయారు.

ముందు నుండి దిగిన వెంకటాచారి అక్కడే నిలబడి ఉన్నాడు. సిగరెట్ ముట్టించాడు.

"మామ నా దగ్గర మూడు రూపాయల చిల్లర లేనట్టుంది, రేపు ఇస్తతీయ్…"

"చిల్లర ఎంత గావాలి అల్లుడు, నా దగ్గర ఉంది గాని…"

"యాబై రూపాయల నోటు ఉన్నట్టుంది…" జేబుల అటిటు వెతికాడు, అది దొరకదని చారికి తెలుసు, మల్లయ్యకు తెలుసు!

"బాగా దోలాడు అల్లుడు, ఏ మూలకు ఉందో…!"

"ఏంది మామ గట్లంటవు, నీ మూడు రూపాయి లకు ఇజ్జత్ తీసినట్లు మాట్లాడుతున్నవు, ఊరిడిచి పోతననుకుంటున్నవా ఏంది?"

"ఏందల్లుడు గంత మాటంటివి, నీ ఇజ్జత్ తీసి నంటివా? ఉంటె ఈ రోజు ఇస్తవు, లేకుంటె రేపు ఇస్తవు. గంతెగాని మూడు రూపాయల కోసం ఎవడైన ఊరిడిచి దెంకపోతర చెప్పు!"

"అయితే రేపు ఇస్త తీయ్, గట్టిగా అడక్కు…"

"గట్టిగ నేను ఎందుకు అడుగుత చెప్పు, గా ఆటోడో, జీబోడో అయితె గట్టిగ పడతరుగాని…"

"అందుకే గదా మామ నీ బండెక్కింది" నవ్వుతూ అక్కడి నుండి వెళ్లిపోయాడు చారి.

మల్లయ్య చారి పోతున్న వైపు చూస్తూ

"నీ లాంటోళ్లను రోజు ఎంతమందిని చూడటం లేదు అల్లుడు… నీ లాంటోడు ఈ భూమి మీద ఉన్నంత కాలం, నా లాంటోడు ఈ బండి మీద బతుకుతని ఉంటడు…", మనసుల అనుకుంట రాజయ్య సేటు ఇంటివేపు బండిని దౌడు తీయించాడు. ■